క్లుప్తంగా

మూగజీవాలకు వ్యాక్సిన్లు

ఆమదాలవలస రూరల్: గొర్రెలు, మేకలకు సంక్రమించే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఓంకార్ తెలిపారు. మండలంలో కొత్తవలస, చీమలవలస, బొబ్బిలిపేట, దూసి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు శనివారం టీకాలు వేశారు. ఈ నెల 1 నుంచి 28 వరకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ టీకాలను వేయించాలని సూచించారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



బీమా మొత్తం అందజేస్తున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు

సరుబుజ్జిలి: కొండవలస గ్రామానికి చెందిన మారోతు లక్ష్మణరావు ఇటీవల కేన్సర్‌తో మృతి చెందారు. మృతుని భార్య సీతారత్నంకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం రూ.10 వేలను సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు శనివారం అందజేశారు. ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ చిన్నారావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

9 నుంచి ఆలయ వార్షికోత్సవం

నరసన్నపేట: గుండివల్లిపేటలోని ఉమా స్వయంబేశ్వరస్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని ఈ నెల 9 నుంచి 11 తేదీల మధ్య నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త పంచిరెడ్డి విశ్వనాథం శనివారం తెలిపారు. 10న అధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుతో ప్రవచనాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విత్తన శుద్ధితో మేలు



అవగాహన కల్పిస్తున్న నైరా విద్యార్థులు

సరుబుజ్జిలి: విత్తనాలను శుద్ధి చేసిన తరువాత వేస్తే మంచి ఫలితాలు ఉంటాయని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. సరుబుజ్జిలి గ్రామంలో శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి వల్ల పంటలకు ఎటువంటి చీడపీడలు, తెగుళ్లు ఆశించవన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లాకులు సూర్యప్రకాశరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్‌టీ సంస్థ ప్రతినిధులు

సరుబుజ్జిలి: ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సీఎఫ్ఎల్ మోటివేటర్ సి.హెచ్.వెంకటేష్ తెలిపారు. మండలంలోని అమృత లింగానగరం గ్రామంలో ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం శనివారం నిర్వహించారు. సైబర్ మోసాలు కోసం 1930, ఆర్బీఐ టోల్‌ఫ్రీ 14448కు ఫోన్లు చేయాలన్నారు. సిబ్బంది రామారావు, సీఎఫ్ లక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు ముందస్తు వాతావరణ సమాచారం



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: దాము పథకం ద్వారా ముందస్తుగా వాతావరణంలో జరిగే మార్పులు రైతుల ఫోన్లకు సమాచారం అందించడం జరుగుతుందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక తెలిపారు. మండలంలోని ఇస్కలపాలెం గ్రామంలో రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఫోన్లలో ఇప్పటికే మేఘదూత్, దామిని తదితర వాతావరణ యాప్‌లు ఇన్‌స్టాల్ చేసినట్లు వెల్లడించారు. వీటి ద్వారా రైతులకు పంట సమాచారంతోపాటు వాతావరణం, పశువులకు వ్యాపించే వ్యాధుల గురించి ముందుగానే వాట్సప్ సందేశం పంపిస్తున్నామన్నారు. అనంతరం పశు వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేవీకే సమన్వయ కర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, పశుసంవర్థక సహాయ సంచాలకులు సి.హెచ్.సుబ్రహ్మణ్యం, పశువైద్యాధికారి డి.సతీష్, కిరణ్, శాస్త్రవేత్తలు బాలకృష్ణ, అనూష పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



జగ్గుశాస్త్రులపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాల్టీ పరిధిలో గల జగ్గుశాస్త్రులపేట, బైరిశాస్త్రులపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ, లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికపరమైన కారణాలతో అర్హులైన లబ్ధిదారులు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరువ చేయడానికి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఉందనే విశ్వాసాన్ని ప్రజల్లో నింపాలన్నారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ పథకాలు అందించడంతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి మంచి గుర్తింపు ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అంటే ప్రజలకు ధీమా అని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అమలు చేస్తున్న పథకాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నామన్నారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు, ఏఈ సృజన, ఆర్ఐ రామారావు, పార్టీ నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, డి.శ్యామలరావు, ఎస్.రామారావు, పి.తిరుపతిరావు, పి.చిన్నారావు, ఎం.కూర్మారావు, కె.అప్పలనాయుడు, ఎం.చక్రధరరావు, కె.సత్యనారాయణ, ఎస్.చిన్నారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



సదస్సులో పాల్గొన్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మహిళా సాధికారతపై పలు రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా శాసన సభ్యులతో విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన 'షి ఈజ్ ఏ చేంజ్ మేకర్ ప్రాజెక్టు- జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ ఆలెక్టెడ్ ఉమెన్ రిప్రజెంటేటివ్స్' వర్క్ షాప్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్‌ను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలతోపాటు 50 శాతం రాజకీయ, కార్పొరేషన్ పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కిందన్నారు.

ఏఓకు సత్కారం



ఏఓను సత్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మెళియాపుట్టి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని ఏఓ దానకర్ణుడు కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం మందస మండలంలోని అంబుగాం పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఓను మంత్రి సీదిరి అప్పలరాజు సత్కరించారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాలో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరించాలన్నారు

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



చంద్రమ్మ పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్, వెల్ఫేర్ అసిస్టెంట్

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-కె సచివాలయ పరిధిలోని మురికింటిభద్ర గ్రామానికి చెందిన వృద్ధురాలు తలగాన చంద్రమ్మకు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగిపోవడంతో.. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గ్రామ సచివాలయం కన్వీనర్ చిన్ని ధర్మారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ పాందర షణ్ముఖరావు శనివారం ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందించారు.

ఈ-క్రాప్ పూర్తిచేయాలి

జలుమూరు: రబీ పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బీమా, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయాలని ఏఓ కె.సురేష్ కుమార్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సీఎస్‌డీటీ గణేష్, ఏఎస్ఓ బి.సుధాకర్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహాలు వినియోగించుకోండి

నరసన్నపేట: సబ్‌జైల్లో విచారణ ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కల్పించే ఉచిత న్యాయ సలహాలు, సూచనలు, సేవలను వినియోగించుకోవాలని నరసన్నపేట కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. స్థానిక సబ్ జైల్‌ను ఆమె శనివారం పరిశీలించి విచారణ ఖైదీలతో మాట్లాడారు. జైల్లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జైలు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

నరసన్నపేట/పోలాకి: నరసన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నరసన్నపేట, పోలాకి మండలల్లోని నాలుగు కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరు కేంద్రాల్లో ఆయాల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు పీఓ నాగమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు నాలుగో తేదీ నుంచి 11వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. కార్యాలయంలో పని వేళల్లో వచ్చి దరఖాస్తులు రిజర్వేషన్ల ప్రకారం చేసుకోవచ్చన్నారు. పోలాకి మండలం కొల్లివలసలో (బీసీ-డీ), గొల్లలవలస (ఓసీ), మబగాం కాలనీ (ఓసీ), అంబీరుపేట(బీసీ-బీ) కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అలాగే పోలాకి మండలం సుసరాం-2 (ఓసీ), మగతపాడు (బీసీ-డీ), ఉర్లాం-1 (బీసీ-ఈ), నరసన్నపేట మండలం చిక్కాలవలస (ఎస్సీ), జోగంపేట (ఓసీ), హడ్కో కాలనీ (ఓసీ ఈడబ్ల్యూస్) కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో

కొత్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొత్తూరు, హిరమండలం మండలాల పరిధిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ తులాల విమలరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాకవరం కేంద్రంలో సహాయకురాలు పోస్టు ఎస్సీలకు, నీలకంఠాపురం కేంద్రంలో సహాయకురాలు పోస్టు బీసీ-ఈలకు కేటాయించారు. హిరమండలం మండలం పాతహిరమండలం కేంద్రంలో హెల్పర్ల పోస్టులకు బీసీ-డికి కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు 4 నుంచి 11 తేదీ లోగా దరఖాస్తులను నేరుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి అందజేయాలన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని పలు ఆశ్రమాలకు చెందిన పీఠాధిపతులు అన్నారు. శనివారం మండలంలోని చాపర గ్రామంలో గల బెండివీధిలో ఉన్న వేంకటేశ్వర భజన మందిరం 28వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నగరసంకీర్తన, ప్రణవ పతాకావిష్కరణ, వేంకటేశ్వర, మండపారాధన, భగవద్గీత పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అన్నసమారాధనలో పలువురు భక్తులు పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు. పలువురు పీఠాధిపతులు భగవంతుని నామస్మరణపై ఉపన్యాసాలు ఇచ్చారు. సద్గురు సదానంద మహర్షి, బ్రహ్మశ్రీ వనమాలి ప్రసాదు, నిర్విషయానంద స్వామీజీ, కరుణకుమార్, రామకృష్ణ, మానెం శివదండాశి తదితరులు పాల్గొన్నారు.

సుసరాం జాతర ప్రారంభం



దుర్గాదేవి అమ్మవారి ఆలయం

పోలాకి: తీరప్రాంత ఇలవేల్పుగా ఆరాధించే సుసరాం దుర్గాదేవి అమ్మవారి 45వ వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జాతర ఐదురోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ ననపల అప్పలసూరి తెలిపారు. పోలాకి మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జాతర కార్యక్రమాలు ఆదివారంతో ముగియనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావుతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు దర్శించుకున్నారు.

సంక్షిప్తంగా...

సెక్రటరీపై దాడి!

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న పెద్దసరియాపల్లి పంచాయతీ సెక్రటరీ కుంచాల మనోజ్ కుమార్‌పై (గ్రేడ్-5) అదే సచివాలయంలో పనిచేస్తున్న తెంబూరు పంచాయతీ సెక్రటరీ బెనమాన రవింద్రబాబు (గ్రేడ్-4) దాడి చేసినట్లు ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్‌కు శనివారం ఫిర్యాదు అందింది. సింగుపురం, లాబర రహదారి మధ్యలో ద్విచక్రవాహనంపై వస్తున్న మనోజ్‌కుమార్‌ను అపి రవింద్రబాబు దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి మనోజ్‌కుమార్ ఫిర్యాదు చేశాడని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ తెలిపారు. దీనిపై ఈఓపీఆర్డీ ఎస్.ప్రసాద్ విచారణ అధికారిగా నియమించామన్నారు. విచారణ పూర్తయితే ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు.

నిబంధనలు పాటించాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మారుతున్న నిబంధనల ప్రకారం స్కూల్ హెచ్ఎంలు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శాంతారావు సూచించారు. శనివారం మండల స్థాయి హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు లెస్సన్ ప్లానింగ్ అమలు చేయాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం సూచించిన ఇతర నిబంధనలన్నీ విధిగా అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, టెన్త్ విద్యార్థుల విద్యా ప్రమాణాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారణ

జలుమూరు: కుష్టు వ్యాధిపై అవగాహన ఉంటే త్వరితగతిని నివారించవచ్చునని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. శనివారం జలుమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో విద్యార్థులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే వైద్య అధికారులను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపాల్ దుర్గారావు, హెచ్ఎస్ చిన్న రాజులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న కేజీబీవీలో లెప్రసీ పట్ల శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ అస్పత్రి వైద్యులు పి.ప్రియాంక, ఎస్.సునీత అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పాతపట్నం: ఏ.ఎస్.కవిటి గ్రామ సమీపంలో ఒడిశా నుంచి అక్రమంగా ఇసుకను తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. పర్లాకిమిడి నుంచి ఏ.ఎస్.కవిటి వైపు వెళ్తున్న ట్రాక్టర్‌కు ఎటువంటి బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.

యువజన సంఘం చేయూత

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురం గ్రామానికి చెందిన రవీంద్ర, భీమారావు ఇటీవల రోడ్డుప్రమాదానికి గురై చికిత్సపొందుతున్నారు. మర్రిపాడు-సి పంచాయతీ జలకలింగుపురం గ్రామానికి చెందిన యువజన సంఘం సభ్యులు వారి కుటుంబాలకు రూ.10వేల సహాయం చేశారు. మర్రిపాడు గ్రామానికి చెందిన చిట్టిబాబు కేన్సర్‌తో బాధపడుతుండటంతో.. ఆ కుటుంబానికి రూ.10వేలు అందించారు. సంఘం సభ్యులు ధనుంజయ, సతీష్, విజయ్, గణపతి ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో నెలకొన్ని విద్యుత్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. పెద్దజొన్నవలస, చిన్న జొన్నవలస, మునగవలస గ్రామాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలను శనివారం ఏర్పాటు చేశామన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

కొత్తూరు: స్థానిక పీఏసీఎస్‌లో తీసుకున్న వ్యవసాయ రుణాలను ఈ నెలాఖరులోగా రైతులు రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ శనివారం తెలిపారు. గతేడాది మార్చిలో తీసుకున్న వ్యవసాయ రుణాలు నెలాఖరులోగా కేవలం నాలుగు శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవాలన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎల్.ఎన్.పేట: మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని వైఎస్సార్ క్రాంతి పథం పీడీ విద్యాసాగర్ అన్నారు. శనివారం ఎల్.ఎన్.పేటలోని వైకేపీ కార్యాలయంలో ఏపీఎం రవిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సమావేశంలో మాట్లాడారు. బ్యాంకుల నుంచి తీసుకుంటున్న రుణాలు, ప్రభుత్వం నుంచి వస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రతి నెలా ఆదాయం వచ్చే మార్గాల్లో పెట్టుబడి పెట్టాలన్నారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనమంతా జగనన్న సైనికులం

- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: మనమంతా జగనన్న సైనికులమని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమష్టిగా పనిచేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మండలంలోని 19 సచివాలయాల పరిధిలో గల కన్వీనర్లు, గృహ సారథులకు శనివారం శిక్షణ, అవగాహన సదస్సును నిర్వహించారు. కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రతీ వలంటీర్‌కు ఇద్దరు గృహ సారథులు, సచివాలయాల పరిధిలో కన్వీనర్లను నియమించినట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేస్తున్న వారిని గుర్తించి కన్వీనర్లు, గృహసారథులుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. పేదవాడు గెలవాలంటే మళ్లీ జగన్‌కు విజయాన్ని అందించాలన్నారు. టీడీపీ నేతలు గ్రామాల్లో చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



గిరిజన ఐక్యవేదిక నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ మామిడిజోల గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు గిరిజనులు శనివారం గిరిజన నాయకులకు సారవకోటలో కలిసి వినతి పత్రం అందించారు. సీతంపేట, కొత్తూరు, సరుబుజ్జిలి మండలాల నుంచి 15 కుటుంబాలవారు గత 8 సంవత్సరాల క్రితం ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. ఈ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణకు విన్నవించారు. తామంతా మామిడిజోల గ్రామంలోని కొండ ప్రాంతాల్లో చీపురు, జొన్న, అరటి, చోడి తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామానికి రహదారి, విద్యుత్, తాగునీరు లేక అవస్థలు పడుతున్నామన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తం



పొందూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు

పొందూరు: క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎంపీ వైద్యుల సంఘం రాష్ట్ర సభ్యుడు కె.రమేష్ అన్నారు. మండల ఆర్ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విధిగా క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లా ఆర్ఎంపీ సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం: మనిషి ప్రాణాలను బలిగొంటున్న కేన్సర్‌ను సమూలంగా నాశనం చేసేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ కరణం సంతోష్‌కుమార్ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సుభలయ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఉచితంగా కేన్సర్ వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం పి.రాజారావు, ఆస్పత్రి అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

హిరమండలం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర సత్యసేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని శనివారం సందర్శించారు. ఆశ్రమ వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఆధ్యాత్మక చింతనతోనే ఉండాలని, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నాటికి ఆశ్రమంలో 35 మందివరకు చేర్చుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆశ్రమ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ ఆశ్రమం రాష్ట్రంలో ఆదర్శంగా ఉందన్నారు. ఆశ్రమ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఆశ్రమం అధ్యక్షుడు అంధవరపు అబ్బాయి, సమన్వయకర్త ఎస్.సాయిబాబా, సభ్యులు చంటి మాస్టర్, జోషుల గోవిందశర్మ, ఆశ్రమ మేనేజర్ కె.జయరామ్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ఆధారంగా బోధన



నృత్యం చేస్తున్న చిన్నారులు

కొత్తూరు: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ఆధారంగా బోధన ఉన్నప్పుడే విద్యార్థులకు ఉత్తమ గుణాలు అలవడుతాయని భారతీయ విద్యా కేంద్రం (బీవీకే) విద్యా సంస్థల కార్యదర్శి ఏవీ రెడ్డి నాయుడు అన్నారు. కొత్తూరులోని బీవీకే విద్యా సంస్థల్లో ఒకటైన విజ్ఞాన భారతి పాఠశాల 33వ వార్షికోత్సవం శనివారం ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి నాయుడు మాట్లాడుతూ విలువలు లేని విద్య శూన్యమన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లలతో కలిసిమెలిసి ఉండాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు రకాల పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ బి.శ్రీధర్, పాఠశాల అధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు నాయుడు, కరస్పాండెంట్ ఎస్.కాశీబాబు నాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త బరాటం గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సారవకోట: మండలంలోని కిడిమి గ్రామంలో శనివారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఇక్కడ శుక్రవారం నుంచి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అనంతరం మహా లింగార్చన, సహస్ర లింగార్చన హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ మండప ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న భజన



పాటలు ఆలపిస్తున్న భజన బృందం

నరసన్నపేట: తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో రామచంద్ర స్వామి దేవస్థానంలో నరసన్నపేట మండలం దూకులపాడుకు చెందిన అభయాంజనేయ భజన బృందం శనివారం భజనలు చేసి ఆకట్టుకుంది. రామదాసు భజన మండలి తెలంగాణ రాష్ట్ర సేవా సమితి పిలుపు మేరకు దూకులపాడు బృందం సభ్యుడు శిమ్మ శ్రీరాములు ఆధ్వర్యంలో 20 మంది భద్రాచలం వెళ్లారు. నాలుగు గంటల పాటు సీతారామ స్వామి ఆలయ ప్రాంగణంలో భజనలు చేసి భక్తి గీతాలు ఆలపించారు. భజన బృందానికి భద్రాచలం దేవస్థానం ప్రతినిధులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉన్న గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బాలకృష్ణ శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సంబంధిత పనులు చేపట్టడంతో సరఫరా నిలిపివేస్తామన్నారు.

హిరమండలం: హిరమండలం, సుభలయ, సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గటంల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ వై.జి.కె.మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిరమండలం విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనులు చేయనుండటంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు.

సారవకోట: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీఏ రాజశేఖర్ శనివారం తెలిపారు. ఉప కేంద్రం పరిధిలో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.